ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 20.0
ANDHRAJYOTHY
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
బుధవారం 3 డిసెంబరు 2025

రాష్ట్రస్థాయి విజేతగా నిలవాలి

- కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్
- పోటీలకు తరలిన జిల్లా కబడ్డీ బాలికల జట్టు

6

అటు ఇటు కాని.. హృదయం తోటి..

- ఉదయం కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లోకి..
- అర్ధరాత్రి సొంత గూటికి చేరిన అభ్యర్థి

7


నామినేషన్ వేస్తున్న నీరటి సుజాత

అన్నదమ్ముల సవాల్!

- రామాపురంలో సోదరుల పోటీ

7

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు


పులికల్ గ్రామంలోని నాగల్‌దిన్నె వంతెనపై పోలీస్ పికెట్

6

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి

- పీజీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

రూ. 26 వేలు వేతనం ఇవ్వాలి

వైభవంగా అంజన్న బ్రహ్మోత్సవాలు


ఇరుముడితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న స్వాములు

పదర/అమ్రాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఆలయం అంజన్న నామస్మరణతో మార్మోగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి మాలధారణ స్వాములు ఇరుముడితో ఆలయానికి చేరుకుంటున్నారు. మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు, టీటీడీ నుంచి వచ్చిన రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రీ, ఈవో రంగాచారి బృందం భక్తి సంకీర్తనల మధ్య హనుమత్ వ్రతం నిర్వహించారు. రాత్రి సమయంలో పార్వతిపరమేశ్వరుల కళ్యాణోత్సవం, మంగళహారతి గజవాహన సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు ఆర్టీసీ బస్సు, ప్రైవేట్ వాహనాల్లో భారీగా తరలి వచ్చారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, పదర ఎస్సై శ్రీను సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నామినేషన్ వేయకుండా అడ్డగింత

- యర్సన్‌దొడ్డిలో ఈనెల 29న ఘటన
- కలెక్టర్ ఆదేశం మేరకు అధికారుల విచారణ

7

చివరి రోజు.. అర్ధరాత్రి వరకు

జోరుగా కొనసాగిన రెండో విడత నామినేషన్లు

గద్వాల/అయిజ/వనపర్తి/నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండో విడత నామినేషన్లు చివరి రోజు మంగళవారం జోరందుకున్నాయి. మల్దకల్, అయిజ, వడ్డేపల్లి, రాజోలి మండలాల్లోని 74గ్రామ పంచాయతీలకు 716 వార్డు సభ్యులకు నామినేషన్లను అధికారులు స్వీకరిస్తున్నారు. రెండు రోజులుగా మందకొడిగా సాగిన నామినేషన్లు చివరి రోజు ఊపందుకోవడంతో నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులు క్యూలైన్‌లో నిలబడ్డారు. రాత్రి పదిగంటల వరకు కూడా అయిజ, మల్దకల్, రాజోలి మండలాలలో నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. అయిజ మండలంలో ప్రధానంగా పులికల్, సింధనూర్, ఉప్పల గ్రామాలలో రాత్రి 11 గంటలైనా నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు క్యూలో వేచి ఉన్నారు. వనపర్తి జిల్లాలోని అమరచింత, ఆత్మకూరు, మదనాపూర్, కొత్తకోట, వనపర్తి మండలాల పరిధిలోని 94 గ్రామ పంచాయతీలు, 850 వార్డు స్థానాలకుగాను దరఖాస్తులు పెద్ద మొత్తంలో వచ్చాయి. మంగళవారం రాత్రి అయినా నామినేషన్ల పర్వం కొనసాగింది. రెండో విడత నామినేషన్ల పర్వం మంగళవారం చివరి రోజు కావడంతో పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అర్ధరాత్రి దాటేదాకా కొనసాగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి, కోడేరు, కొల్లాపూర్, పెద్ద కొత్తపల్లి, నాగర్‌కర్నూల్, పెంట్లవెల్లి, తిమ్మాజీపేట మండలాల పరిధిలోని 151 గ్రామ పంచాయతీలకు నామినేషన్ల దాఖలు గడువు మంగళవారంతో ముగిసింది. చివరి రోజు దాదాపు రాత్రి 10 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు.


నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లిలో రాత్రి 10 గంటలకు క్యూలో ఉన్న అభ్యర్థులు


ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న అడివమ్మ


నాగర్‌కర్నూల్ జిల్లా గుమ్మకొండలో నామినేషన్లకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో సురేశ్


రాజోళిలో రాత్రి 11 గంటలకు క్యూలైన్లో ఉన్న అభ్యర్థులు

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

-నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్


ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని కేటాయిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. మొదటి, రెండో విడత ఎన్నికలు నిర్వహించే13 మండలాలకు సిబ్బందిని ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ దేవ సహాయం పర్యవేక్షణలో నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం సిబ్బందిని నియమించామని, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొదటి విడతలో జరిగే ఎన్నికలకు 1,326 పోలింగ్ కేంద్రాలు, రెండో విడతలో జరిగే ఎన్నికలకు 1,412 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటికి ప్రిసైడింగ్, వోపీవోలను కేటాయించామని తెలిపారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, వోపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ విడతలో జరిగే ఎన్నికలకు 20శాతం అదనంగా సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికల నిబంధనలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామని తెలిపారు.

బెడిసికొట్టిన 'ఏకగ్రీవం'

- గ్రామస్థుల తీర్మానానికి అంగీకరించని ఓ అభ్యర్థి
- ఉపసంహరణకు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణ
- రాఘాయిపల్లిలో ఆర్డీవో, సీఐ విచారణ
- కేసు నమోదు చేసిన పోలీసులు

7

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం



కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వరుడి దేవాలయం

7

పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉత్తరాదిమఠం నుంచి ఆలయం వరకు ఊరేగింపు
- నేడు నెమలివాహన సేవ, ప్రభోత్సవం

వైకల్యాన్ని జయించి ధైర్యంగా ముందడుగు వేసి..

- వివిధ రంగాల్లో దివ్యాంగుల ప్రతిభ
- తమ పిల్లల కోసం టీచర్లుగా మారిన తల్లులు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

6


మానసిక దివ్యాంగుడు సాయిచరణ్‌తో తల్లి అంజనేశ్వరి

వాలీబాల్ చాంపియన్‌గా ఉమ్మడి పాలమూరు బాలికల జట్టు

- మూడోస్థానంలో బాలుర జట్టు

6

లెక్కల టీచర్ కావాలి

- రోడ్డెక్కిన విద్యార్థులు


అలంపూర్ వెళ్లే రోడ్డుపై ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న బైరాపూర్ విద్యార్థులు

అలంపూరుచౌరస్తా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):తమ పాఠశాలకు లెక్కల టీచర్ కావాలని జోగుళాంబ గద్వాలజిల్లా ఉండవల్లి మండలంలోని బైరాపూర్‌లో ఉన్నత పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. లెక్కల టీచర్ లేకపోతే బోధన ఎలా సాగుతుందని 10వ తరగతి విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని బైరాపూర్ గ్రామం నుంచి 3 కిలోమీటర్ల దూరం ఉన్న అలంపూరు రోడ్డు వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. లెక్కలు బోధించకుంటే పరీక్షలు ఏలా రాయలని విద్యార్థులు ప్రశ్నించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు వచ్చి సమస్యను పైఅధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఇద్దరు ఫిజికల్‌సైన్స్ టీచర్లు ఉన్నారు. మొన్నటిదాక ఇక్కడ ఉన్న లెక్కల టీచరు పాఠాలు బోధించలేదని ఇటీవల డిప్యూటేషన్‌పై పంపారు. ప్రస్తుతం ఆయన మానవపాడు ఆర్వోగా విధుల్లో ఉన్నారు. విద్యార్థులు ఆందోళన చేయడంతో ఆర్వోగా విధుల్లో ఉన్న రాజనీకాంత్‌రెడ్డినే పంపించాలని ఆదేశాలిచ్చారు. పాఠాలు చెప్పని పంతులునే మళ్లీ పంపుతారా అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరు మునుగుతుంటే ఎన్నికలా..?

చారకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఊరు మునుగుతుంటే ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా ప్రజలు మంగళవారం ఎర్రవల్లిలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి గ్రామస్థుడు ప్రకాశ్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని గోకారం వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌తో మా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని కొంత తగ్గించి మా గ్రామాలు ముంపునకు గురికాకుండా చూడాలని, లేకుంటే సర్పంచు ఎన్నికలను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూ నిర్వాసితులకు ప్రకటించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దుచేస్తేనే సర్పంచు ఎన్నికలకు వెళ్తామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్ష చేపట్టిన భూ నిర్వాసితులు

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి


వైద్య, ఆరోగ్య సిబ్బందికి జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధితులకు ఉత్తమ వైద్య సేవలందించిన వారికి మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్‌రెడ్డి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, గంధం నాగరాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

పీఎంశ్రీ జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ విజయవంతం


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పట్టణంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పీఎంశ్రీ జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్ విజయవంతమైంది. స్థానిక జడ్పీ మైదానంలో మంగళవారం నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా దాదాపుగా అన్ని మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో బాలుర విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ తూడికుర్తి విద్యార్థులు ప్రథమ స్థానం, జెడ్పీహెచ్‌ఎస్ అమ్రాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో ఎంజేపీ కల్వకుర్తి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి డీఈవో రమేష్‌కుమార్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వర్‌రావు, మాజీ కార్యదర్శి పాండు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీల్లో భద్రత ముఖ్యం

గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు భద్రత చాలా ముఖ్యమని జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' కార్యక్రమాన్ని మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి ప్రారంభించారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రజలకు భద్రతాయుత డిజిటల్ వాతావరణం కల్పించడంపై పర్యవేక్షిస్తూ వాటిపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. సురక్షిత డిజిటల్ లావాదేవీలకు అవగాహనే ప్రధాన ఆయుధమని, ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం డిసెంబరు 2 నుంచి 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగులయ్య, అధికారులు ఉన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

వాలీబాల్ చాంపియన్‌గా ఉమ్మడి పాలమూరు బాలికల జట్టు

» మూడో స్థానంలో బాలుర జట్టు



రాష్ట్రవాలీబాల్ విజేత బాలికల జట్టు, మూడో స్థానంలో బాలుర జట్టుతో జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత నెల 29 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలుర జట్టు మూడవ స్థానంతో సరిపెట్టుకున్నది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులను, కోచ్, మేనేజర్లు పర్వేజ్‌పాష, ఖదీర్, గీతలను మంగళవారం వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, మహ్మద్‌హనీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, దస్తగీర్‌లు అభినందించారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జి వేణుగోపాల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-19 హ్యాండ్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు రజినీకాంత్‌రెడ్డి, జియావుద్దీన్, శంకర్, ఆసీఫ్, ప్రదీప్, బాలు, అర్చన పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతగా నిలవాలి

» కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

» పోటీలకు తరలిన జిల్లా కబడ్డీ బాలికల జట్టు



జిల్లా కబడ్డీ బాలికల జట్టుతో జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ ఆకాంక్షించారు. నల్గొండ జిల్లాలో బుధవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనేందుకు జిల్లా బాలికల జట్టు మంగళవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కురుమూర్తి గౌడ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ఎంతో మంది జాతీయస్థాయి టోర్నీల్లో రాణించారని గుర్తుచేశారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు బాలరాజు, గణేష్, సంగీత, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆంజనేయస్వామి ఉత్సవాలు



ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

దేవరకద్ర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న రాజమూర్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ధ్వజారోహణం, పంచామృతాభిషేకాం, అలంకరణ, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, పంచా మృతాభిషేకం అనంతరం రాత్రికి ఆలయ ఆవరణంలో శ్రీనివాస కల్యాణం, హంస వాహనం వంటి కార్యక్ర మాలు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ ఈవో శ్యాంసుందర్‌చారి తెలిపారు. ఆలయ చైర్మన్ గోపాలచారి, భక్తులు పాల్గొన్నారు.



రాగి పైరులో ఆటో సాయంతో ఎట్టెం కొడుతున్న రైతు రఘు

ఆటోతో రాగి పంటకు ఎట్టెం

రాగి పైరు ఏపుగా పెరిగేందుకు, కొత్త పిలకలు వచ్చేందుకు రైతులు ఎట్టెం కొడతారు. అందుకోసం సాధారణంగా ఎద్దులను వినియోగిస్తారు. కానీ ఓ రైతు ఎద్దులు అందుబాటులో లేకపోడంతో ఆటోకు ఎట్టం కట్టి పొలంలో తిప్పాడు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ గ్రామానికి చెందిన రఘు ఈ పద్ధతిని ఎంచుకున్నాడు.

- హన్వాడ (ఆంధ్రజ్యోతి)

వైకల్యాన్ని జయించి.. ధైర్యంగా ముందడుగు వేసి..

» వివిధ రంగాల్లో దివ్యాంగుల ప్రతిభ

» తమ పిల్లల కోసం టీచర్లుగా మారిన తల్లులు

» నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వారు వైకల్యాన్ని జయించారు. అందరితో సమానంగా నిలవాలన్న లక్ష్యంతో ధైర్యంగా ముందడుగులు వేస్తున్నారు. వికలత్వం శరీరానికే కానీ మనసుకు కాదని నిరూపిస్తున్నారు. తమకు ఇష్టమైన రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ అందరినీ అబ్బుర పరుస్తున్నారు. పట్టుదలతో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ తాము ఎందులోనూ తక్కువ కాదని సమాజానికి చాటి చెప్తున్నారు. తల్లిదండ్రులు సైతం వారి వెన్నంటి ఉంటూ ప్రోత్సహిస్తుండటంతో అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. దీంతో పాటు వారికి ప్రభుత్వం కూడా తోడ్పాటును అందిస్తోంది. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కొందరు దివ్యాంగులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలు మీ కోసం...



కన్నవారి భవిష్యత్తు కోసం..



మానసిక దివ్యాంగురాలైన కుమార్తెతో తల్లి సుజాత

సాధారణంగా తమ పిల్లలు పుట్టుకతో దివ్యాంగులైతే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఆ బాధను దిగమింగుకొని తమ పిల్లలకు ఉత్తమ భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా భావించారు. అందుకోసమే వారు బీఈడీ చదువుకున్నారు. అందులోనే స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యను అభ్యసించి తమ పిల్లలు చదివే పాఠశాలలోనే టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాలలో ఎంఏ బీఈడీ చదువుకొని స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన అంజనేశ్వరి తన 11 ఏళ్ల కొడుకు(మానసిక దివ్యాంగుడు)ను చూసుకునేందుకు అదే పాఠశాలలో టీచర్‌గా చేరారు. తన కొడుకుతో పాటు మరికొంత మంది దివ్యాంగులకు కూడా చదువు చెప్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. అదేవిధంగా ఎంఏ బీఈడీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుకున్న సుజాత కూడా అదే పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. తన 20 ఏళ్ల కుమార్తె (మానసిక దివ్యాంగురాలు)ను దగ్గరుండి చూసుకుంటూ మిగతా పిల్లలకు కూడా పాఠాలు బోధిస్తోంది. మానసిక దివ్యాంగులు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు వీరద్దరూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కంప్యూటర్‌లో రాణిస్తూ..



కంప్యూటర్ పనులు చేస్తున్న మానసిక దివ్యాంగుడు ప్రణీత్

జిల్లాకేంద్రానికి చెందిన ప్రణీత్ బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాలలో ఒకేషనల్ శిక్షణ పొందుతున్నాడు. పుట్టుకతో దివ్యాంగుడైన అతడికి, అన్ని విధాలా తల్లే అండగా నిలిచింది. కుమారుడిని కంప్యూటర్ శిక్షణలో చేర్పించింది. ఆ బాలుడు ప్రస్తుతం కంప్యూటర్‌లో రాణిస్తున్నాడు. వర్డ్, ఎక్స్‌ఎల్ తదితర విభాగాల్లో ఆరితేరాడు. పాఠశాలకు సంబంధించిన ఏ ప్రోగ్రామింగ్ అయనా కంప్యూటర్లో తానే సమాచారాన్ని నమోదు చేస్తుంటాడు. కంప్యూటర్ రంగంలో తన కొడుకును పరిజ్ఞానవంతుడిగా తయారు చేయాలన్నదే లక్ష్యమని అతడి తల్లి అరుణ చెప్తున్నారు.

ఇంతయినా అంతవాడు



డ్యాన్స్ చేస్తున్న మానసిక దివ్యాంగుడు గౌతమ్

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ధనలక్ష్మీ కాలనీకి చెందిన గౌతమ్ పుట్టుకతో మానసిక దివ్యాంగుడు (మరుగుజ్జు). అతడు జిల్లాకేంద్రంలోని బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాలలో ప్రి- ఒకేషనల్-1 చదువుతున్నాడు. బుద్ధిమాంద్యం ఉన్నప్పటికీ డ్యాన్స్‌లో మాత్రం దిట్ట. ఇటీవల హైదరాబాద్‌లోని జాతీయ మానసిక దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, నవరాత్రి ఉత్సవాలు, వివిధ దినోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లోనూ నృత్యం ప్రదర్శనలు ఇస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. అందరిని ఆకట్టుకుంటాడు. నవరాత్రి ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలలో కూడా డాన్సులు చేస్తుంటాడు.

రూ. 26 వేల వేతనం ఇవ్వాలి

» కాంట్రాక్టు కార్మికుల డిమాండ్

» గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా



ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న సిబ్బంది

గద్వాల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్క్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి. అంజనేయులు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు తక్కువ సంఖ్యలో ఉండటంతో పనిభారంతో అవస్థలు పడుతున్నారన్నారు. దీనికి తోడు సరైన వేతనాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కొనసాగుతున్నా కార్మికుల స్థితిగతులు మారలేదన్నారు. కాంట్రాక్టర్ అందుబాటులో లేక సూపర్‌వైజర్ల వేధింపులతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

హాస్పటల్‌లో 320 బెడ్లు ఉండగా, 60 మంది లోపే శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు ఉండటం దారణమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కార్మికుల సంఖ్యను పెంచాల'ని, మూడేళ్ల కాల పరిమితి దాటినందున పాత కాంట్రాక్ట్‌ను రద్దుచేసి కొత్తగా టెండర్లు పిలవాలని డిమాండ్ చేసారు. ధర్నాలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పరశు, సిబ్బంది మతిన్, లక్ష్మణ్, అంజి, కన్నా, వెంకటేశ్వరి, చిట్టెమ్మ, జయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



జమిస్తాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలు గాజులపేట, జమిస్తాపూర్, ధర్మాపూర్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ ప్రజలకు భద్రత, నమ్మకం కలిగించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ ఒక్కరూ చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పర్యవేక్షణ, రాత్రివేళ బీట్ పెట్రోలింగ్ ఉంటుందని చెప్పారు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నారాయణపేటలో ముగిసిన అనంతోత్సవాలు

» విశ్వవల్లభ తీర్థ స్వామీజీకి పుష్పాభిషేకం

» వైభవంగా మహా రథోత్సవం

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని అనంతసేన ఆలయంలో కొనసాగుతున్న అనంతోత్సవం, ధార్మిక కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా కర్ణాటక సోదెవాదిరాజ మఠం పీఠాధిపతి విశ్వవల్లభ తీర్థ స్వామిజీ నేతృత్వంలో అనంతసేన స్వామి మూలవిరాట్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూలరాముల సంస్థాన పూజ, మహారథోత్సవాలను వైభవంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీపాద్ ఆధ్వర్యంలో స్వామిజీకి పుష్పభిషేకం చేశారు. కార్యక్రమంలో జ్యోషి రఘుప్రేమాచార్య, అలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, స్వాములు

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు

అయిజ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని పులికల్, నాగల్‌దిన్నె ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ప్రారంభించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దళారులు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, ఇక్కడికి తీసుకొచ్చి విక్రయించే అవకాశం ఉంది. దీన్ని అడ్డుకునేందుకు అలంపూర్ మండలంలోని రాయల్‌పాడు, రాజోళిలో సుంకేసుల, ఉండవల్లిలో పుల్లూరు, భైరాంపూర్, గట్టులోని బల్గేర ప్రాంతాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటిని వ్యవసాయం, పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు గద్వాల ఉపాధ్యాయుడు



టి రవిశంకర్

గద్వాల సర్కిల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చండీగఢ్ రాష్ట్రంలోని పంజాబ్ యూనివర్శిటీలో ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్)గద్వాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు టి.రవిశంకర్ ఎంపికయ్యారు. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్ జరుగనున్నది. రవిశంకర్ పుల్లూరు జడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుంచి ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, విషయ నిపుణులు హాజరుకానున్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి

» పీజీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం



కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు , విద్యార్థులు

కొల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలని కొల్లాపూర్‌లోని పీజీ కళాశాల (పీయూ అనుబంధం) ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంలో భాగంగా కొల్లాపూర్ పట్టణంలోని పీజీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ దాని సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రకృతి పర్యావరణంతో జరిగే లాభనష్టాలను క్లుప్తంగా వివరించారు. సమాజంలో ప్రతీ ఒక్క విద్యార్థి బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు యువత ముందుకు రావాలని విద్యార్థులను కోరారు. అడవులను రక్షించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంతోష్ కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

» ప్రయాణికులు సురక్షితం



రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ డీలక్స్ బస్సు

మూసాపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ డీలక్స్ బస్సు అదుపుతప్పింది. సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న సూపర్ డీలక్స్ బస్సు జానంపేట పాత పెట్రోల్ బంకు వద్దకు రాగానే, ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సెడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుకనే ఉన్న బస్సు అదుపుతప్పి, రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్లకు తగిలి ఆగింది. దీంతో ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వారందరినీ మరో బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. సంఘటనపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

పట్టపగలే ద్విచక్ర వాహనం చోరీ

మద్దూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచ క్రవాహనం చోరీకి గురయ్యింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, మద్దూరులో జరిగింది. పట్టణంలోని బుక్కగేరిలో నివసిస్తున్న ఎండీ ఇలియాస్ మంగళవారం ఉదయం తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉంచి, నారాయణపేటకు వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. దీంతో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

మానవపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆరుగురిని బైండవర్ చేయించినట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. అనంతరం వారిని లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను వెల్దండ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని కొట్ర చౌరస్తా సమీపంలో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కల్వకుర్తి నుంచి వెల్దండ వైపు ఇసుకలోడుతో వస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో జాజాల గ్రామానికి చెందిన టిప్పర్ యజమాని రాజిరెడ్డి, డ్రైవర్ కుర్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బాలానగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. ఎఫ్ఎస్‌టి బృందం బాలానగర్ మండల కేంద్రం సమీపంలో తనిఖీలు చేస్తుండగా దేవుని గుట్టతండా వైపు వెళ్తున్న మారుతి డిజైర్‌ను ఆపారు. కారులో పరిశీలించగా దాదాపు రూ. 10 వేల విలువైన వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లు లభించాయి. దీంతో డ్రైవర్ లావుడియా నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫోన్ చోరీ చేసి.. ఫోన్‌పేతో రూ. 1.92 లక్షల కాజేత

» ఖాతాను ఫ్రీజ్ చేయించిన పోలీసులు

సంతోష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ చోరీ చేసి అందులోని ఫోన్ పే యాప్‌ను ఉపయోగించి ఓ దొంగ నగదు కొట్టేశాడు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలెపల్లికి చెందిన రాధాకృష్ణారావు(74)మాజీ సర్పంచ్. గత నెల 13న నాగోల్‌లో ఉంటున్న కుమారుడి ఇంటికొచ్చాడు. తిరిగి సాయంత్రం తన స్వస్థలమైన పోలెపల్లికి వెళ్లేందుకు నాగోల్‌లో బస్సు ఎక్కి, మిధాని బస్టాండ్ వద్ద దిగాడు. ఆరాంఘర్‌కు వెళ్లే బస్సులో ఎక్కి కొద్ది దూరం ప్రయాణించాక తన సెల్‌ఫోన్ పోయిందని గుర్తించాడు. పోలెపల్లికి వెళ్లి కొత్త సెల్, సిమ్ వేసి పరిశీలించారు. అప్పుడే తన కెనరా బ్యాంకు సేవింగ్ అకౌంట్ నుంచి రూ.1.92లక్షల నగదు బదిలీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. వెంటనే చోరీపై మంగళవారం కంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యాప్ ద్వారా బదిలీ అయిన నగదు రూ. 1.21 లక్షలను ఫ్రీజ్ చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకుంటున్న నీరటి రాంచంద్రయ్య

అటు ఇటు కాని.. హృదయం తోటి..

- ఉదయం కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి..
- అర్ధరాత్రి సొంత గూటికి చేరిన అభ్యర్థి

మరికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'అటు ఇటు కాని హృదయం తోటి/ ఎందుకురా ఈ తొందర నీకు' అన్న పాట.. ఈ సందర్భానికి సరిగ్గా సరిపోతుందనిపిస్తోంది. నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల కేంద్రానికి చెందిన నీరటి రాంచంద్రయ్య సోమవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఆ పార్టీ మద్దతుతో ధన్వాడ సర్పంచ్ స్థానానికి తన భార్య నీరటి సుజాతతో నామినేషన్ దాఖలు చేయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తమై చర్యలు చేపట్టారు. అదే రోజు అర్ధరాత్రి మళ్లీ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు శివకుమార్ సమక్షంలో సొంత గూటికి చేరి, పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే భార్య చేత వేయించిన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటారా? లేదా అలాగే ముందుకు సాగుతారా వేచి చూడాల్సి ఉంది.

బెడిసికొట్టిన 'ఏకగ్రీవం'

- గ్రామస్థుల తీర్మానానికి అంగీకరించని ఓ అభ్యర్థి
- ఉపసంహరణకు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణ
- రాఘాయిపల్లిలో ఆర్డీవో, సీఐ విచారణ
- కేసు నమోదు చేసిన పోలీసులు

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని రాఘాయిపల్లిలో ఓ అభ్యర్థి ఎదురుతిరగడంతో ఏకగ్రీవ తీర్మానం బెడిసికొట్టింది. మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న ఈ గ్రామపంచాయతీ ఎస్సీ జనరల్‌కు రిజర్వు అయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. కానీ సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేయాలని గ్రామస్థులందరూ అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి రూ. 25 లక్షలు ఇస్తానని సామ వెంకటయ్య అనే అభ్యర్థి ప్రతిపాదించడంతో అందరూ అంగీకరించారు. కానీ బర్కం గణేశ్ అనే అభ్యర్థి మాత్రం దీన్ని వ్యతిరేకించి వెళ్లిపోయాడు. అంతే కాకుండా తాను నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే రూ. 5 లక్షలు ఇస్తామంటూ తనపై ఒత్తిడి తెస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్ సిబ్బందితో కలిసి మంగళవారం గ్రామానికి చేరుకొని స్థానికులతో సమావేశమయ్యారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలని, ఎవరైనా బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బలవంతపు ఏకగ్రీవాలు చెల్లవని స్పష్టం చేశారు.

ఈ విషయంపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ చిదానందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సామ వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.



రాఘాయిపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో, సీఐ



అక్షరమాల ప్రకారం గుర్తుల కేటాయింపు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలుగు అక్షరమాల ప్రకారం ప్రాధాన్య క్రమంలో గుర్తులను కేటాయిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలలో పేర్కొన్న పేరును అందులోని మొదటి అక్షరాన్ని ప్రాధాన్య క్రమంలో చూస్తారు. నామినేషన్ పత్రంలో ఏదైతే ముందు ఉంటుందో, ఆ అక్షరాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థుల తమ బ్యాలెట్ స్థానాన్ని ప్రభావితం చేసేందుకు కొందరు పేరును ముందుగా రాసి, ఆ తరువాత ఇంటి పేరు రాస్తారు. మరికొందరు ఇంటిపేరును ముందు రాస్తారు. ఉదాహరణకు అనంతయ్య, ఆంజనేయులు లేదా కళ్యాణ్ పోటీలో ఉంటే అనంతయ్యను మొదటి ప్రాధాన్యంగా పరిగణిస్తారు. తరువాత ఆంజనేయులు, కళ్యాణ్‌ల పేర్లు తీసుకుంటారు. వీరికి అక్కడ ప్రాధాన్యతలో కేటాయించిన గుర్తుల వరుస దక్కుతుంది.

ఎమ్మెల్యేల సొంతూళ్లలో త్రిముఖపోరు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేల సొంత ఊర్లలో త్రిముఖ పోటీ నెలకొన్నది. దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి స్వగ్రామం చిన్నచింతకుంట మండలం ధమగ్నాపూర్ జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. అక్కడ కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీల మద్దతుతో అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి స్వగ్రామం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ ఎస్సీకి రిజర్వ్ అయింది. ఇక్కడ కూడా త్రిముఖ పోరు నెలకొంది. కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు బరిలో ఉన్నారు.

తొలి విడత ఎన్నికలకు నేడు గుర్తుల కేటాయింపు

- ఈ రోజే నామినేషన్ల ఉపసంహరణ

నారాయణపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ తొలి విడత ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు బుధవారం గుర్తులను కేటాయించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లలో మొదటి అక్షరాన్ని పరిగణనలోకి తీసుకొని తెలుగు వర్ణమాల ఆధారంగా అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించి జాబితాను రూపొందిస్తారు. ఒక వేళ అభ్యర్థి ఇంటి పేరును ఆంగ్లంలో, తన పేరును తెలుగులో రాస్తే, పేరులోని మొదటి అక్షరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఇద్దరు అభ్యర్థుల పేర్లు, ఇంటి పేరు ఒకే విధంగా ఉంటే.. మొదట నామినేషన్ వేసిన వారి పేరును ముందు చేరుస్తారు. ఇలా అభ్యర్థులకు వరుస క్రమంలో గుర్తులను కేటాయిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏ గ్రామంలో ఎంత అభ్యర్థులు పోటీలో ఉంటారో, ఎవరికి ఏ గుర్తులను కేటాయించారో తేలనున్నది.

అన్నదమ్ముల సవాల్!

- రామాపురంలో సోదరుల పోటీ

పెంట్లవెల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని రామాపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అన్నదమ్ములు సై అంటే సై అంటూ పోటీకి దిగారు. జనరల్‌కు రిజర్వు అయిన ఈ గ్రామ పంచాయతీలో సర్పంచు పదవి కోసం సొంత అన్నదమ్ములు చెరో పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున అన్న కొమ్ము గోపాల్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ తరఫున తమ్ముడు కొమ్ము రాజుయాదవ్ మంగళవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇద్దరూ పోటీ పడటం సమంజసం కాదని, ఎవరో ఒకరు తప్పుకోవాలని కుటుంబ సభ్యులు వారికి నచ్చచెప్పేందుకు యత్నించినట్లు సమాచారం. కానీ అందుకు వారు అంగీకరించలేదని తెలిసింది.



రామాపురంలో కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న తమ్ముడు కొమ్ము రాజుయాదవ్

సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

జడ్చర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సుదర్శన్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి స్వగృహంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. పాత, కొత్త అన్న తేడా లేకుండా నాయకులు, కార్యకర్తలందరినీ కుటుంబసభ్యుల్లాగా భావిస్తామని తెలిపారు. పార్టీలో రౌడీలు, భూకబ్జాదారులకు స్థానం లేదని స్పష్టం చేశారు. జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా, కొల్లూరును మండలంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సుదర్శన్‌గౌడ్

మురహర్‌దొడ్డి సర్పంచుగా పెద్ద నర్సమ్మ

- ఏకగ్రీవానికి గ్రామస్థుల తీర్మానం

కృష్ణ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని మురహర్‌దొడ్డి సర్పంచుగా కుమ్మరి పెద్ద నర్సమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు తీర్మానించుకున్నారు. మారెమ్మ ఆలయంలో మంగళవారం వారు సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే సదరు అభ్యర్థి గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు, ఆలయ నిర్మాణానికి రూ. 8 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు సమాచారం.



ఏకగ్రీవంగా ఎన్నుకున్న కుమ్మరి పెద్ద నర్సమ్మ

టంకరలో 'రాజ'బుడ్డప్ప

- గ్రామంలో ఆ కుటుంబానిదే హవా
- ఇప్పటి వరకు రెండు పర్యాయాలే ఇతరులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలం టంకర మేజర్ గ్రామపంచాయతీలో మొదటి నుంచి ఇప్పటివరకు నేటి వరకే ఒకే కుటుంబం హవా కొనసాగుతోంది. అదే మెండె రాజుబుడ్డప్ప కుటుంబం. 1956 నుంచి 1990 వరకు రాజ బుడ్డప్ప సర్పంచ్‌గా పనిచేశారు. ఈ మధ్య కాలంలో 1980 తరువాత శరణప్ప అనే వ్యక్తి మూడేళ్ళు సర్పంచ్‌గా పనిచేశారు. రాజబుడ్డప్ప తరువాత 1995లో అతని చిన్నకొడుకు అచ్చెన్న భార్య లక్ష్మి సర్పంచ్‌గా గెలుపొందారు. 2001, 2006లలో రెండు పర్యాయాలు అచ్చెన్న సోదరుడు శ్రీనివాసులు సర్పంచ్‌గా గెలుపొందారు. 2014లో గ్రామం ఎస్సీకి రిజర్వ్ కావడంతో యశోద అనే మహిళ సర్పంచ్‌గా పనిచేశారు. 2019లో అచ్చన్న తిరిగి సర్పంచ్ అయ్యారు. ప్రస్తుతం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మరోసారి అదే కుటుంబం నుంచి అచ్చెన్న భార్య లక్ష్మి పోటీలో నిలిచారు. ఇప్పుడు కూడా సర్పంచు పదవిని ఏకగ్రీవం చేసేందుకు గ్రామంలో చర్చలు నడిచాయి. ఏకగ్రీవం చేస్తే కోటి రూపాయలు ఆంజనేయస్వామి గుడికి ఇస్తానని చెప్పడంతో అందరూ అంగీకరించారు. కానీ ఈ విషయం మీడియాలో వైరల్ కావడంతో ఏకగ్రీవానికి బ్రేక్ పడి, పోటీ అనివార్యమైంది. గ్రామ జనాభాలో 75-80 శాతం అచ్చన్న సామాజిక వర్గం వాళ్ళే ఉండటంతో వారి కుటుంబం హవానే సాగుతోంది. ఈ కుటుంబంలో ప్రస్తుతం అచ్చెన్న, ఆయన భార్యనే ఉన్నారు. అచ్చన్న కొడుకు అమెరికాలో స్థిరపడ్డారు.



టంకర గ్రామ పంచాయతీ కార్యాలయం

చెన్నిపాడు ఏకగ్రీవానికి యత్నం?

- రూ. 28 లక్షలకు వేలం పాట!

మానవపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవానికి గ్రామస్థుల మధ్య అంగీకారం కుదిరినట్లు సమాచారం. ఇక్కడ మూడో విడతలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం స్థానిక దేవాలయం వద్ద గ్రామస్థులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో స్మశానవాటిక ఏర్పాటు కోసం సర్పంచు పదవికి వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన సంజన్న అనే వ్యక్తి రూ. 28 లక్షలకు పాడి పదవిని దక్కించుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు వెల్లడి కావలసి ఉన్నది.

దావాజిపల్లి పంచాయతీ ఏకగ్రీవం

- సర్పంచుతో పాటు, వార్డు స్థానాలు కూడా..

పాన్‌గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని దావాజిపల్లి సర్పంచ్‌తో పాటు, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు తీర్మానించుకున్నారు. గ్రామంలోని రచ్చకట్ట వద్ద మంగళవారం సమావేశం నిర్వహించుకొని చర్చించుకున్నారు. గ్రామానికి చెందిన సూరమ్మను సర్పంచ్‌గా, ప్రేమ్ సాగర్‌ను ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు.

అలాగే గ్రామంలోని మొత్తం పది వార్డులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ వల్ల ఖర్చుతో పాటు ఘర్షణలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. అవేవీ లేకుండా ఉండేలా గ్రామస్థులం అందరమూ కలిసి ఏకగ్రీవంగా తీర్మానించుకున్నామని చెప్పారు.



ఏకగ్రీవ సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామస్థులు

నామినేషన్ వేయకుండా అడ్డగింత

- యర్సన్‌దొడ్డిలో గతనెల 29న ఘటన
- కలెక్టర్ ఆదేశం మేరకు అధికారుల విచారణ

గద్వాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో మొదటి విడత నామినేషన్ల సందర్భంగా ఓ వ్యక్తిని నామినేషన్ వేయనీయకుండా అడ్డుకున్న సంఘటనపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట గ్రామానికి చెందిన కుశ అనే వ్యక్తి నవంబరు 29న నామినేషన్ వేసేందుకు యర్సన్‌దొడ్డిలోని నామినేషన్ కేంద్రానికి వెళ్లాడు. అయితే అప్పటికే సర్పంచు పదవికి ఓ వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు ప్రతిపాదించడంతో ఆయన నామినేషన్ వేశాడు. కానీ కుశ కూడా నామినేషన్ వేయడానికి వెళ్లడంతో కొందరు ఆయనను అడ్డుకున్నారు. ఈ విషయంపై బాధితుడు ఈనెల 1వ తేదీన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనను అడ్డుకొని ఒక గదిలో బంధించారని, నామినేషన్ పత్రాలను చించివేశాడని అతడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాకుండా సర్పంచు పదవిని వేలం వేసి, ఏకగ్రీవం చేశాడని లిఖిత పూర్వకంగా పేర్కొన్నారు. ఇదే విషయంపై సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఈ నేపథ్యంలో కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశం మేరకు తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో రమణారావు, ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం గ్రామానికి వెళ్లి బాధితుడు కుశతో మాట్లాడి, లిఖిత పూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద సంఘటన జరగడంతో, రిటర్నింగ్ అధికారి వివరణ కూడా తీసుకున్నారు.



చింతల కుంటలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

ఈ విషయంపై తహసీల్దార్ హరికృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, కలెక్టర్ ఆదేశం మేరకు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

పేరూర్ సర్పంచ్ ఏకగ్రీవం

దేవరకద్ర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కౌకుంట్ల మండల పరిధిలోని పేరూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందుకోసం మంగళవారం గ్రామస్థులు సమావేశం నిర్వహించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి కొత్త శ్రుతి అరవింద్‌కుమార్ రెడ్డిని సర్పంచుగా ఎన్నుకోవాలని తీర్మానించారు. మొత్తం 10 వార్డుల్లో 5 కాంగ్రెస్‌కు, మరో 5 వార్డులు ఇతర పార్టీలకు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. వారి నిర్ణయం మేరకు ఉప సర్పంచును ఎన్నుకోనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో.. వివాహిత ఆత్మహత్య

కల్వకుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తిలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరు మండలం జాజాల గ్రామానికి చెందిన ఎ.గౌతమ్, భార్య మాధవి (35) దంపతులు కల్వకుర్తిలోని విద్యానగర్‌కాలనీలో నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య కలహాలు తలెత్తడంతో మనస్తాపానికి గురైన మాధవి సోమవారం అర్ధరాత్రి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సమాచారం అందుకున్న పోలీసులు, మాధవి కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మాధవి (ఫైల్)

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.62 వేలు, 4 ఫోన్లు స్వాధీనం

జడ్చర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ సమీపంలోని చెరువు అలుగు వద్దనున్న పేకాట శిబిరంపై మంగళవారం ఎస్ఐ జయప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురి వద్ద రూ. 62 వేలు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పారిపోయారని ఎస్ఐ తెలిపారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● జడ్చర్ల మండలంలోని చెర్లపల్లిలోని ఓ బెల్టు షాపుపై ఎస్ఐ జయప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఈ సందర్భంగా వివిధ బ్రాండ్లకు చెందిన 4.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

మల్దకల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం, స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం వేద పండితులు మధుసూదనాచార్యులు, రమేశాచార్యుల ఆధ్వర్యంలో హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే రోజు రాత్రి జరిగిన స్వామి వారి కల్యాణానికి దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు వాల్మీకి పూజారుల సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి ప్రారంభించారు. కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి క్షేత్రానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పట్వారి ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు

పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉత్తరాదిమఠం నుంచి ఆలయం వరకు ఊరేగింపు
- నేడు నెమలివాహన సేవ, ప్రభోత్సవం

మక్తల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని ఉత్తరాది మఠం నుంచి పడమటి ఆంజనేయస్వామి ఆలయం వరకు స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త ప్రాణేషాచారి, అర్చకులు అరవింద్, ఈవో కవిత, భక్తులు అంజన్‌ప్రసాద్, శ్రీనివాసులు, రజినీకాంత్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు పవమాన హోమం, సాయంత్రం 5 గంటలకు నెమలివాహన సేవ, 6 గంటలకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు.



పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజారోహణకు హాజరైన భక్తులు

న్యూస్ బాక్స్

విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తా

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తానని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి జంగిలి హర్షవర్ధన్‌రెడ్డికి ప్రోత్సాహకంగా చదువుల నిమిత్తం గోలి శ్రీనివాస్‌రెడ్డి తనవంతుగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదరికం చదువులకు అడ్డుకారాదని, వాటన్నింటినీ అధిగమించి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ అనిల్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ నాగులునాయక్, నాయకులు నిరంజన్, యాదగిరి, ఆనందు, రాజు, జగన్, శేఖర్, శివ ఉన్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఉప్పునుంతల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందన, సంగీత, విద్యార్థులు ఉన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ఊర్కొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేష్ తల్లి మాసమ్మ మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీమంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి, ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జంగిలి తిరుపతయ్య మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఉపసర్పంచ్ నిరంజన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరుతో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పట్ల ఆకర్షితులవుతున్నారని నిరంజన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, కుడుముల శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, యాదగిరి, ఆనందు, రవికుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీ భవనానికి రంగులు

కల్వకుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణం గాంధీనగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం -1 భవనం పాతబడి ఉంది. కల్వకుర్తికి చెందిన స్వామి వివేకానంద స్వామి సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో సభ్యులు పాతబడిన భవనానికి రంగులు వేసి శుభ్రపరిచారు. విద్యార్థులకు చదువుకోవడానికి మంచి వాతావరణం ఉండాలనే ఉద్దేశంతోనే భవనానికి రంగులు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఫాతిమాబేగం, నాయకులు మహేష్‌గౌడ్, లక్ష్మీనర్సింహ, రోహిత్‌శర్మ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో కంటి చికిత్స శిబిరం

కందనూలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌లోని సత్యసాయి మందిరంలో ఈ నెల 3న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ హకీం ప్రసాద్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక

వెల్దండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెల్దండ గ్రామపంచాయతీ పరిధిలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన మందగాల కృష్ణయ్య మంగళవారం బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి యెన్నం శేఖర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న పథకాలు, దేశ రక్షణకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు మోహన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, ప్రభాకర్, పెద్దయ్య, రవి ఉన్నారు.

సర్పంచ్ 1, వార్డులు 4 నామినేషన్ల ఉపసంహరణ

వంగూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మండలంలో తుమ్మలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానంలో 1, వెల్మలపల్లిలో - 1, అన్నారం-1, రంగాపూర్ - 2 చొప్పున వార్డులకు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎంపీడీవో బ్రహ్మాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఆతర్వాత సర్పంచ్, వార్డుల స్థానాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా హనుమద్ వ్రతం

- శివాంజనేయ దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

కందనూలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం పక్కన గల పురాతనమైన శివాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ గణేష్ బృందం, శివాంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సామూహిక హనుమత్ వ్రతం వైభవంగా జరిగినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రాజేశ్వర్‌శర్మ తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి వివాహ దినోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఎమ్మెల్యేను శివాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు, గణేష్ బృంద కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణులు ఓరుగంటి వేణుగోపాల్‌శర్మ, ఏనమండ్ర రాజేశ్వర్‌శర్మ హనుమన్ వ్రతాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. శివాంజనేయ భక్త కమిటీ సభ్యులను ఖానాపురం బుచ్చన్న, తిమ్మాజిపేట రాములు, వెంకటేశ్వర్లు, మధు, జగన్, ఇందిరమ్మ, చంద్రకళ, సుమిత్ర, సత్యమ్మ, శ్రీనులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గణేష్ బృందం సభ్యులు, శివాంజనేయ కమిటీ సభ్యులు, సాయిభక్తులు, మహిళలు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడితో ఆంజనేయస్వాములు

ఆంజనేయస్వామి మాలధారణ ఇరుముడి

అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాగణంలో మంగళవారం అచ్చంపేట పట్టణానికి చెందిన స్వాములు, గురుస్వామి బలరాం స్వామి, ఆధ్వర్యంలో మాలధారణ ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. మాలధారణ చేసిన స్వాములు ఇరుముడితో మద్దిమడుగు చేరుకొని అంజనేయస్వామిని దర్శించుకుంటారు. 42 రోజులుగా స్వాములు మాలలతో భక్తి శ్రద్ధలతో ఆంజనేయస్వామి దీక్ష పూని భక్తిశ్రద్ధలతో, నియనిష్ఠలతో భక్తి పారవశ్యంతో పూజలు చేస్తూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామాపురంలో

పెంట్లవెల్లి (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో అలివేలు మం గసమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటగా గణపతిపూజ, పుణ్యాహవచనము, మూల మంత్రములు, అభిషేకములు, మహామంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా బుధవారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించాక, గురువారం 11.30 నిమిషాలకు అలివేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పదిలో వందశాతం ఫలితాలు రాబట్టాలి

- డీఈవో రమేష్ కుమార్



పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

తెలకపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన బోధన అందించాలని జిల్లా విద్యాశాఖ ఏ రమేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం తెలకపల్లి మండలంలోని తెలకపల్లి, పెద్దపల్లి, ఆలేరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు పెద్దూరు, పెద్దపల్లి, ప్రాథమిక పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉన్నత పాఠశాలను సందర్శించి సబ్జెక్టులలో గల సిలబస్ పూర్తిగా అయ్యాయా లేదా అడిగి తెలుసు కున్నారు. ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజనం వివరాలపై ఆరా తీశారు. పదో తరగతి సబ్జెక్టుల్లో సామర్థ్యాలను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో భీమానాయక్

వంగూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో భీమానాయక్ అన్నారు. మంగళవారం వంగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో జరిగిన ఆశా వర్కర్ల సమా వేశంలో ఆయన పాల్గొన్నారు. ఆసుపత్రిలో రోగులకుసరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచిం చారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శాంతాబాయి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- కౌన్సిలర్ గోపిశెట్టి శివ



ధ్వజస్తంభం ఏర్పాటు దాత రఘును సన్మానించిన కౌన్సిలర్

అచ్చంపేటటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కౌన్సిలర్ గోపిశెట్టి శివ అన్నారు. మంగళవారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో అంజనేయ స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన రఘు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కోసం ముందుకు వచ్చారన్నారు. కౌన్సిలర్లు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తానని చెప్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అంజనేయస్వాములు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో చేపపిల్లల పంపిణీ



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ అధికారులు

తిమ్మాజిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లలను పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం తిమ్మాజిపేటలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. మండలంలోని మారేపల్లి, మరికల్, బుద్ధసముద్రం, కోడుపర్తి, అమ్మపల్లి, ఆవంచ, పోతిరెడ్డిపల్లి, పుల్లగిరి గ్రామాలకు సంబంధించి ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిరాం, నాస్మిన్, సాహిత, మత్స్యశాఖ అధికారులు నరసింహ, మాత్స్య ముదిరాజ్ సంఘం నాయకులు కృష్ణయ్య, నిరంజన్, శ్రీనివాసులు, మౌలాలి, వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల పంపిణీ



కుర్చీలు పంపిణీ చేస్తున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు

కల్వకుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఇందిరనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి మిత్ర ఫౌండేషన్ సభ్యులు కుర్చీలు, ప్లేట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కోసం కూర్చోవడానికి కుర్చీలు, తినడానికి ప్లేట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విద్యావతి, మిత్ర ఫౌండేషన్ సభ్యులు వెంకటేష్, రమేష్, నరేష్, కార్తిక్, తరుణ్, శ్రీకాంత్, అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

ద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు : ఎస్‌ఐ నరేష్

తెలకపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో గ్రామాల్లో వాట్సాప్, ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్, వంటి సోషల్ మీడియా వేదికల్లో ఒక వర్గాన్ని మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ద్వేషపూరితంగా వర్గ వైషమ్యాలకు ప్రేరేపించేలా వ్యాఖ్యలు పోస్టులు, వీడియోలు పెడితే వాటిని పోస్ట్ చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఆయన మంగళవారం ప్రెస్‌నోట్ ద్వారా పైవిధంగా పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పడితే ఆ గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు కాపాడేందుకు తెలకపల్లి మండల ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు.

చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎస్‌ఐ జగదీ శ్వర్

కోడేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రతీ ఒక్కరు చట్టాలను గౌరవించి చట్టపరిధిలోనే నడుచు కోవాలని చట్టాలను అతిక్రమిస్తే ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జగదీశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచులుగా నామినేషన్లు వేస్తున్న జనుంపల్లి కోడేరు, ఎత్తం, మైలారం, నర్సాయిపల్లి గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సోషల్ మీడియాపై గట్టి నిఘా ఉంటుంది

- ఎస్‌ఐ గురుస్వామి

తాడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాపై అభ్యంతకర పోస్టులు పెట్టినట్లయితే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పార్టీల మధ్య, వ్యక్తుల మధ్య భావోద్వేగ ప్రకటనలు, రెచ్చగొట్టే ప్రసంగాలు వంటివి చేసినట్లయితే అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం మండల కేంద్రంతోపాటు మండలంలోని 24గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న అన్ని సోషల్ మీడియా గ్రూపులు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎవరైనా భావోద్వేగ, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కచ్చితంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

బూత్‌ల వారీగా సామగ్రి సిద్ధం

తాడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్నికల సామగ్రిని అధికారులు మంగళవారం సిద్ధం చేశారు. ఎంపీడీవో అంజనేయులు మాట్లాడుతూ బుధవారం విత్ డ్రాల అనంతరం ఫైనల్ లిస్టును పూర్తి చేస్తున్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేస్తామని సూచించారు. సామగ్రిని సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ఊర్కొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్‌ఐ కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఊర్కొండపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఠాకూర్ తండాలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేశారు. సారా తయారీదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫ్రాడ్ కో ఫుల్ స్టాప్ పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. డిసెంబరు 2 నుంచి జనవరి 12 వరకు ఆరు వారాలు, ఆరు థీమ్స్‌తో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కాల్ ఓటీపీ, కేవీ ఐసీ, మార్ఫింగ్ మోసాలకు గురికావద్దని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లు మొదట లాభం చూపి తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించి మోసం చేస్తాయని, అలాంటి మోస పూరిత చర్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు, జిల్లా సైబర్ క్రైం టీం, పాలెం యూనివర్సిటీ ప్రిన్సి పాల్, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టంతోనే అభ్యర్థుల ఎంపిక

వంగూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పని చేసే వారే కాక, పార్టీకి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి సర్పంచ్ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం వంగూరు గేటు వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలపై పార్టీ కార్యకర్తలతో సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయానికి పార్టీ శ్రేణులు అంతా కలసికట్టుగా పనిచేసి సత్తా చాటాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నాకు అవకాశం రాలేదని కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహ పడవద్దన్నారు.

నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో



బల్మూరు : శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

తిమ్మాజిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోత) : స్థానిక ఎన్నికల రెండవ విడతలో చివరి రోజు మంగళవారం మండలంలోని గుమ్మకొండ, తిమ్మాజిపేట నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ తనిఖీ చేశారు. ఆయన నామినేషన్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నామినేషన్లు ఎలా వస్తున్నాయి, ఎలా తీసుకుంటున్నారని వివరాలను ఆర్వోతో అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలు విధిగా పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలన్నారు. తహసీల్దార్ జయంతి, ఎంపీడీవో లక్ష్మీదేవి, మండల విద్యావర్, రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శులు హేమలత, సంధ్య పాల్గొన్నారు.

ఎన్నికల నిబనంధనలు పాటించాలి

- డివిజనల్ ఎన్నికల అధికారి మాధవి

బల్మూరు, (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించి సక్రమంగా ఎన్నికలు జరిగే విధంగా అధికారులు సమయపాలనతో పాటు ఎక్కడ ఇబ్బంది కలగకుండా చూడాలని అచ్చంపేట డివిజనల్ అధికారి మాధవి తెలిపారు. మంగళవారం మండల పరిషత్‌కార్యాలయ సమావేశంలో గదిలో ఎన్నికలపై అధికారుల శిక్షణలో ఆమె మాట్లాడారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలో బుధవారం నుంచి ఎన్నికల నామినేషన్లను ఉదయం 10:30గంటల వరకు ఉంటుందని వారు తెలిపారు. మండల వ్యాప్తంగా ఏడు క్లస్టర్లను, ఏడు రూట్లను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. శిక్షణలో ఎన్నికల పత్రాలను అధికారులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాఘవులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, స్టేజ్-1అధికారులు, స్టేజ్-2 అధికారులు పాల్గొన్నారు.

ఆర్వోలకు శిక్షణ

అమ్రాబాద్, (ఆంధ్రజ్యోతి) : మూడవ విడతలో అమ్రాబాద్ మండలంలోని 20 గ్రామ పంచాయతీలు, 182వార్డులకు జరగనున్న గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్వో, ఏఆర్వోలకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ సోమవారం నుంచి 5వ తేదీ వరకు జరిగే నామినేషన్ల స్వీకరణ కోసం స్టేజ్-1 అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించి ఈ సందర్భంగా ఎన్నికలకు కావాల్సిన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింగయ్య, సూపరింటెండెంట్ రేవత్ రెడ్డి, ఎంపీవో పాల్గొన్నారు.

మూడో విడత నామినేషన్లకు సర్వం సిద్ధం

- డివిజన్ 141 సర్పంచ్‌లు, 1221 వార్డు స్థానాలకు ఎన్నిక



ఉప్పునుంతల : ఆర్‌వోలకు ఎన్నికల మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వరుణ్‌తేజ

అచ్చంపేట, డిసెంబరు 2 ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట డివిజన్‌లోని ఆరు మండలాల్లో మూడవ విడత పంచాయతీ ఎన్నికలకు నామినే షన్లకు సర్వంసిద్ధం చేశారు. డివిజన్‌లోని అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూరు, లింగాల, అమ్రాబాద్, పదర మండలాల్లో 141 గ్రామ పంచాయతీలకు, 1221 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 42 క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అచ్చంపేట మండలంలో 38 సర్పంచ్‌లు, 312 వార్డులు, 11క్లస్టర్లు, ఉప్పునుంతల 27గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, 221 వార్డులు, 7క్లస్టర్లు, బల్మూరు మండలంలో 23 సర్పంచ్‌లకు గాను 208 వార్డులు, 7క్లస్టర్లు, లింగాల మండలంలో 23 సర్పంచ్‌లకు 206 వార్డులు, 9క్లస్టర్లు, పదర మండలంలో 10 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు గాను, 92వార్డులు, 3క్లస్టర్లు, అమ్రాబాద్ 20 సర్పంచ్‌లు, 182 వార్డులు, 5 క్లస్టర్లలో నామి నేషన్ల స్వీకరణ ఈ నెల 3 నుంచి 5 వరకు కొ నసాగనున్నాయి. ఆయా రిజర్వేషన్లకు అనుగు ణంగా అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధమ వుతున్నారు.


నేటి నుంచి మూడో విడత నామిషన్లు

చారకొండ, (ఆంధ్రజ్యోతి) మూడో విడత సర్పంచు ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి 5వ తేది వరకు మండలంలో నాలుగు కేంద్రాల్లో నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లోసర్పంచు ఎన్నికలకు చారకొండ, శిర్సనగండ్ల, గోకారం, జూపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సర్పంచులు, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ పి. వీరబాబు తెలిపారు.

సామగ్రి పంపిణీ

ఉప్పునుంతల, (ఆంధ్రజ్యోతి) : మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా 27 సర్పంచ్‌లతో పాటు 221 వార్డులు ఉన్నాయి. మండలంలో మొత్తం జనాభా 34225 ఉండగా ఓటర్లు 30876 ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 15,171, స్త్రీలు 15,705 మంది ఉన్నారు. అభ్యర్థులు ఆయా గ్రామాలలో నామినేషన్లు వేయాలని ఎంపీడీవో వరుణ్‌తేజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మూడో విడతలో పాల్గొనే ఆర్‌వోల ఎన్నికల నామినేషన్ మెటీరియల్ ఎంపీడీవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పార్లమెంటు



నందివడ్డెమాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంటు నిర్వహిస్తున్న విద్యార్థులు

బిజినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంటు ఆకట్టుకుంది. విద్యార్థులు రెండు గ్రూప్‌లుగా విడిపోయి అధికార, ప్రతిపక్ష ఎంపీలు, ప్రధానమంత్రి, మంత్రులు, స్పీకర్, రాష్ట్రపతిగా చట్ట సభల్లో బిల్లులపై చర్చించి చట్టాలు రూపొందించే విధానాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించి దేశంలోని సమస్యలపై చర్చించి సంబంధిత శాఖల మంత్రుల ద్వారా సమాధానాలు చెప్పించడం నిజమైన పార్లమెంటును తలపించారు. రాష్ట్రపతిగా తులసి, ప్రధానమంత్రిగా స్వాతి, స్పీకర్‌గా గీత, ప్రతిపక్ష నాయకుడిగా హిమవంతు, పార్లమెంటు కార్యదర్శిగా పావని వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళీమోహనచార్యులు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు కృష్ణకుమార్, హుస్సేన్, హనుమంత్ రెడ్డి, వెంకటస్వామి, నాగిరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.